క్లుప్తంగా

కాలభైరవుడికి పౌర్ణమి పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న కాలభైరవుడు

రాయచోటి టౌన్ : బుద్ధ పౌర్ణమి సందర్భంగా కాలభైరవుడికి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని భైరవ గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవ స్వామికి ఆలయ ధర్మకర్త ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు.

వెండి ఖడ్గం వితరణ

శ్రీ కాలభైరవుడికి భక్తులు వెండి ఖడ్గం సమర్పించారు. చక్రాయపేట మండలం కోనంపేటకు చెందిన పెద్దిరెడ్డి లక్ష్మీ అఖిల, పెద్దిరెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి (బోర్‌వెల్స్), వారి పిల్లలు భువనేశ్వర‌రెడ్డి, లక్ష్మి శారద, వారి తల్లిదండ్రులు పెద్దిరెడ్డి శ్వరమ్మచ విజయచంద్రారెడ్డి బహూకరించారు. వీరికి ఆలయ అర్చకులు ఘనంగా సన్మానించారు.

పట్టాభూముల్లో ప్రభుత్వ రోడ్డు


పట్టా భూమిలో ప్రభుత్వ నిధులతో వేసిన సీసీ రోడ్డు

నందలూరు : మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 953 సర్వే నంబర్ పట్టా భూమిలో యజమానుల అనుమతి లేకుండా సిమెంట్ రోడ్డు వేశారని ఆ సర్వే నంబర్‌లోని ఒక యజమాని అయిన షేక్ అన్సర్‌బాషా సోమవారం స్థానిక తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ రాధాకృష్ణంరాజులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అన్సర్ బాషా మాట్లాడుతూ ఈ రోడ్డులో ఎటువంటి నివాస గృహాలు లేవని, కేవలం వ్యవసాయ భూములు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఇక్కడ రోడ్డు వేయడం వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని తెలిపారు. తమ భూముల్లో వేసిన రోడ్డును తొలగించాలని ఆయన కోరారు. తమకు సమాచారం ఇవ్వకుండా రోడ్డు వేసిన వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెబ్ డెవలపర్ శిక్షణా తరగతులు

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌సెంటర్‌లో వెబ్ డెవలపర్ శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున, కళాశాల ప్రిన్సిపాల్ పి.శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివిన యువతీ యువకులు వెబ్ డెవలపర్ కోర్సు చేయవచ్చన్నారు. మూడు నెలల పాటు జరిగే ఈ కోర్సుకు ఆసక్తి గల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు గణేష్ 9550104260 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ భక్తవత్సలం

సంబేపల్లె : మండల పరిధిలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయ ప్రాంగణంలో జాతర సందర్భంగా తిరుపతి సంకల్ప మల్టీ స్పెషాలటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం జాతరకు వచ్చిన భక్తులకు సంబేపల్లె ఎస్‌ఐ భక్తవత్సలం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ అనంతనాగ్, సిబ్బంది సోమశేఖర్, బాషా, ఖాదర్‌వలి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె: పాపిరెడ్డిపల్లి గ్రామంలోని జీవనజ్యోతి ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నఓరంపాడు ఎన్‌ఆర్‌ఐ నాగినేని రమేష్ నాయుడు జన్మదినం సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు, అనాథ పిల్లలు, దివ్యాంగులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు పాణ్యం సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆశ్రమంలోని వృద్ధులకు, అనాథలకు సహాయ సహకారాలు అందించాలని దాతలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తీయక.. దుర్వాసన వీడక

- రోడ్డుపైనే కోళ్ల వ్యర్థాలు
- ఆ దారిన వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


సిద్దవరం రోడ్డులో పారబోసిన కోళ్ల వ్యర్థాలు

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉన్న సిద్దవటం రోడ్డులో నాలుగురోడ్ల వద్ద వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. కొత్తపల్లి గ్రామంలోని చికెన్ సెంటర్‌ల యజమానులు వ్యర్థాలన్నీ ఈ నాలుగు రోడ్ల కూడలి వద్ద వేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలతో గాలి వీచినప్పుడల్లా ఆ దుర్వాసనతో స్థానికుల ముక్కు పుటాలదిరి పోతున్నాయి. పైగా వీటి వల్ల ఎలాంటి రోగాలు వస్తాయోనని భయపడుతున్నారు. ఓబిలి, సిద్దవరం, నడిమి సిద్దవరం, దిగువ సిద్దవరం, కంబాలకుంట, పెనగలూరు గ్రామాలకు వెళ్లే ప్రజలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. చినుకు పడితే ఈ వ్యర్థాల నుంచే వచ్చే దర్వాసన అర కిలోమీటర్ వరకు వెదజల్లుతుంది. అదే దారిలో ఓ వైపు కోళ్ల వ్యర్థాలతో పాటు కోళ్ల ఈకలు, ఇతరత్రా భాగాలు సైతం వేస్తున్నారు. ఇవన్నీ తేలికపాటివి కాబట్టి ఏ మాత్రం గాలి వీచినా అవి సమీప ఇళ్లల్లోకి వస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. చాలా కాలంగా ఈ పరిస్థితి ఉన్నా ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆ వ్యర్థాలను కాస్త దూరంగా వేయాలని చెప్పినా వినడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులకుఫిర్యాదుచేసినాపట్టించుకోలేదన్నారు.

కుక్కలు, పందులు స్వైర విహారం

ఈ క్రమంలో చికెన్ వ్యర్థాల కోసం వచ్చిన వీధి కుక్కలు రోడ్డుపై వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. సాయంత్రం అయితే ద్విచక్ర వాహనాల వెంట కుక్కలు పడుతున్నాయి. ఇక ఒంటరిగా ఈ దారిన వెళ్లాలంటే కుక్కలు ఎక్కడ మీద పడి కరుస్తాయోనన్న భయంతో ఈ దారిన వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. అక్కడ పందులు గుంపులు గుంపులుగా చేరి ఆ మురికి కంపును మరింత రెట్టింపు చేస్తున్నాయి. వ్యర్థాలను పారబోయడంతో రోడ్డు డంపింగ్‌యార్డును తలపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ వ్యర్థాల వల్ల అనారోగ్యాలు ప్రబలుతున్నాయని, చిన్నారులు రుగ్మతలకు గురవుతున్నారని ఆరోపిస్తున్నారు. స్వచ్ఛంద్ర- స్వచ్ఛ దివాస్ అంటూ హడావిడి చేస్తున్న అధికారులు రోడ్ల చెంతన నివాస ప్రాంతాల సమీపంలో వేస్తున్న వ్యర్థాలను పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. రోడ్డు పక్కన వ్యర్థాలు పారబోయొద్దని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే వ్యర్థాలను తొలగించి వాటిని పారబోస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనుల పండువగా గరుడ సేవ


పురవీధుల్లో ఊరేగుతున్న నృసింహస్వామి

రాజంపేట టౌన్: మండలంలోని భువనగిరిపల్లె గుట్టపై లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడసేవను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే స్వామివారికి పెద్దఎత్తున పూజలు చేపట్టారు. అనంతరం లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి లక్ష్మీనృసింహ స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. తొలుత ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. రాజంపేట నియోజకవర్గంలో భువనగిరిపల్లె గుట్టపై ప్రతిఏటా నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని, ప్రతి ఏడాది కూడా తాను పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించే భాగ్యం దక్కుతుండటం తన పూర్వజన్మ సుకృతమన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నాగా పృథ్వీరెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, నాగా శేఖర్‌రెడ్డి, రేవరాజు శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.


స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణం చేస్తున్న పండితులు


లక్ష్మీనరసింహ స్వామికి పూజలు చేస్తున్న మేడా మధుసూదన్‌రెడ్డి

సిద్దవటం: మండల శివారులోని జేఎంజే కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం సోమవారం వైభవోపేతంగా జరిగింది. దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు, వీరి ధర్మపత్ని భారతి, కుటుంబ సభ్యులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ఉదయం లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్‌కు సుదర్శన హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి విగ్రహాలను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను వేద పండితులు పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం స్వాముల వారికి గణపతి పూజ, కంకణాధారణ, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి కార్యక్రమంతో మంగళ వాయిద్యాల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేముల గిరిప్రసాద్, బాలాజీ, రిటైర్డ్ తహసీల్దారు గంగులయ్య, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ నరసింగాళ్ల సునీల్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాలెం చిన్న సుబ్బరాయుడు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మేడా

మండలంలోని జేఎంజే కళాశాలకు ఎదురుగా వెలసిన పెంచల లక్ష్మీనరసింహ స్వామిని వైఎస్సార్‌సీపీ నాయకుడు మేడా మధుసూదన్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈయన వెంట ఆలయ చైర్మన్ వేటూరి గిరిప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, నాయకుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ మోటకట్ల మల్లూరు క్రాస్ వద్ద నీటి ట్యాంకు వద్ద జూదమాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు జూదస్థావరంపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.48,200 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

రాయచోటి టౌన్ : ఎయిడ్స్,హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాలతో రాయచోటి జిల్లా ఎయిడ్స్, టీబీ అధికార కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో కళాజాతను ప్రదర్శించారు. కళాజాత బృందం కళాకారులు ఆటాపాటల ద్వారా హెచ్‌ఐవీ, సుఖవ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవేంద్ర, పి. శైలజ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాలు తొలగించండి

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి స్థలం ప్రధాన రహదారి ప్రక్కనే ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి భారతి అన్నారు. సోమవారం స్థానిక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గురు మహేష్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణంలో అక్రమాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి భారతి మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తీసివేయాలని లేని పక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గురు మహేష్, వీఆర్‌ఓ ముజీబ్, రెవెన్యూ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం


సురేష్ బాబును సన్మానిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: కడప మేయర్ సురేష్ బాబును సోమవారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగేంద్రలు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతం చేయడానికి నియోజకవర్గంలో కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ ఆంజనేయులు, పగడాల మల్లి, నాగరాజు, కె శంకరయ్య, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుల్లంపేట: ఇళ్ల పట్టాలకు అర్హులైన వారు ఆయా గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అరవింద కిషోర్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఇంటి స్థలాలు లేని అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి


వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

రాయచోటి టౌన్ : భూ సమస్యలపై వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్ నరసింహకుమార్ రెడ్డి, వీఆర్వోలకు సూచించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో (పరిష్కార వేదిక) జిల్లా కలెక్టర్ నిర్వహించిన కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలతో మన వద్దకు వస్తే వారితో సోదరభావంతో వ్యవహరించి సమస్యను పరిష్కరించే విధంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వంశీ, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పీఏపై ఫిర్యాదుల వెల్లువ

టాస్క్‌ఫోర్స్ : రాష్ట్ర రవాణ, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పీఏ రెడ్డికుమార్ అవినీతి అక్రమాలపై నియోజకవర్గం నుంచి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువలా అందినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈనెల 11వ తేదిన కష్టం ఒకరిది....లాభం మరొకరికి అన్న వార్తపై టీడీపీలోని మరో వర్గం మంత్రి పీఏపై ఫిర్యాదు చేసినట్లు పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతుంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, అభిమానుల నుంచి 40 ఫిర్యాదులు అందినట్లు పార్టీ వర్గాల సమాచారం. అందిన ఫిర్యాదుల మేరకు అధిష్టానం సీరియస్‌గా పరిగణిస్తూ ఫోన్లు ద్వారా విచారణ సాగించినట్లు కూడా వినికిడి. పీఏ రెడ్డి కుమార్ సంబేపల్లి మండలంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా మంత్రి పేరు అడ్డుపెట్టుకొని చేస్తున్న దందాల విషయాలను కూడా పార్టీ అధిష్టానానికి పంపిన ఫిర్యాదులలో పూస గుచ్చినట్లు చేరవేసినట్లు సమాచారం.

ఘనంగా నర్సుల దినోత్సవం


ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నర్సులు

రాయచోటి టౌన్ : కలెక్టరేట్ ఎదురుగా 15 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం నర్సులు సమ్మె చేస్తున్నారు. అయితే సోమవారం శిబిరంలోనే అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూల మాల వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో తాము సేవలు చేస్తున్నామని చెప్పారు. అలాంటి సేవా భావంతో పని చేసే తమను గుర్తించి తమ సమస్యలను పరిష్కంచకపోవడం విచారకరమన్నారు.

కొనసాగుతున్న సమ్మె

అన్నమయ్య జిల్లాలోని కలెక్టరేట్ ఎదురుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు 15 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులు అయిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిర్వహిస్తున్న సమ్మెలో ఉద్యోగ క్రమబద్ధీకరణ, వేతన సవరణ తదితర సమస్యల పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పీఎంసీపీ నాయకులు సాల్మోహన్, అహమ్మద్ బాషా, శివకుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం దిగువ హరిజనవాడ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ శెట్టిపల్లి గ్రామ పరిధిలోని దిగువ హరిజనవాడలో మూడు నెలలుగా దళితులు తాగడానికి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర, మహిళలు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ ద్వారా ఉపాధి అవకాశాలు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్‌ఎస్‌డీసీ) ద్వారా స్కిల్ హబ్ సెంటర్ ద్వారా వుబ్ డెవలెపర్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు మే నెల నాల్గవ వారం నుంచి మొదలు అవుతాయని తెలిపారు. ఈ శిక్షణలో మూడు నెలల కాలపరిమితి ఉంటుందని తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా రాయచోటి మాసాపేటలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలకు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9550104260కు ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి


రాజంపేట సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

రాజంపేట: రాజంపేట సబ్‌డివిజన్‌పరిధిలోని వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ కోరారు. ఈ మేరకు రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో సబ్‌కలెక్టర్ నైదియాదేవికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె రెవిన్యూ డివిజన్‌లోని వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి మణి, వీఆర్‌ఏ సంఘం నాయకులు సుధాకర్, లక్ష్మీకర్, సుండుపల్లె బాష, నందూరు పెంచలయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన సబ్‌కలెక్టర్

పీజీఆర్‌ఎస్‌లో భాగంగా సబ్‌కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభాభవనంలో ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ వినతులు స్వీకరించారు. నిబంధనల మేరకు వీలైనంత వరకు వినతులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో ఎమ్మెల్యే ఆకేపాటి

పెనగలూరు: పెనగలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఉదయగిరి సుబ్బరాయుడు, ధనమ్మ కుమారుడు డాక్టర్ మధుసూదన్‌రావు వివాహం సోమవారం ఘనంగా జరిగింది. వివాహానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రామయ్య కల్యాణం


స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండ రామాలయంలో దక్షిణవైపు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆశీనులు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలలతో సీతారాములను సుందరంగా అలంకరించారు. అలంకరణ అనంతరం ఆలయ అర్చకులు శ్రావణ్ కుమార్, పవన కుమార్‌లు కల్యాణ ఘట్టాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుండి భక్తులు హాజరుకాగా కల్యాణం అనంతరం హాజరైన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

రాయచోటి : ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఏపీ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. జాబీర్ మాట్లాడుతూ విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం స్పష్టమైన జీవో విడుదల చేయకుండా ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

కమనీయం.. నరసింహస్వామి కల్యాణం


పెనగలూరు: ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు


పెనగలూరు: మాంగల్యం చూపుతున్న ఆలయ అర్చకులు


వీరబల్లి: శివపార్వతుల, లక్ష్మీనరసింహ స్వాములకు కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పెనగలూరు: మండలంలోని ఈటమాపురం గ్రామంలో నరసింహస్వామి కొండపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. నరసింహస్వామి జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆలయ వైస్ చైర్మన్ గుండాల్ రెడ్డి, మహేశ్వరి దంపతులు ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆదివారం వేకువ జామున నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణం తిరుపతికి చెందిన బాలాజీ స్వామి ఆధ్వర్యంలో 11 మంది వేద పండితులు ఈ కల్యాణ్నాని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు రాజుపాలెం గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే మహిళలకు ముత్యాల తలంబ్రాలను కూడా పంచిపెట్టారు. నరసింహస్వామి కల్యాణానికి భక్తులు విరివిగా తరలివచ్చారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

వీరబల్లి: మండల కేంద్రంలో అతి పురాతనమైన హరిహరాదుల దేవాలయంలో సోమవారం లక్ష్మీనరసింహ, శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. హరిహరాదుల దేవస్థానంలో లక్ష్మీ నరసింహస్వామికి, శివపార్వతులకు ఒకే వేదికపైన కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణ ఉత్సవానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు తరలివచ్చారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మండలంలోని అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, పాల్గొనడం జరిగింది. స్వాముల వారికి ఉదయం నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి లక్ష్మీనరసింహ, శివపార్వతును మండలకేంద్రంలో రథంపై పురవీధులలో తప్పట్లు, తాళాలతో, కోలాటాలతో ఊరేగింపు చేశారు.


పెనగలూరు: కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు తదితరులు